# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 24-08-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. ఉక్రెయిన్-రష్యా మధ్య నెలకొన్న వివాదాన్ని చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే పరిష్కరించుకోవాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పునరుద్ఘాటించారు.
2. గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి సాధ్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
3. ఆంధ్రప్రదేశ్ లో నైపుణ్య గణన సర్వే కోసం ప్రత్యేక ప్రణాళిక తయారు చేస్తున్నామని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు.
4. వసతి గృహాలలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందేలా ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోందని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డి. శ్రీబాలవీరాంజనేయ స్వామి తెలిపారు.
5. తెలంగాణలో రుణమాఫీ కానీ రైతులకు నిర్ణీత తేదీని నిర్ణయించి రుణ మాఫీ చేస్తామని రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.
6. ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" కార్యక్రమం రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.

=========================

ఉక్రెయిన్-రష్యా మధ్య నెలకొన్న వివాదాన్ని చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే పరిష్కరించుకోవాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పునరుద్ఘాటించారు. మూడు రోజుల అంతర్జాతీయ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నిన్న పోలాండ్ పర్యటన ముగించుకొని ప్రత్యేక రైలులో ఉక్రెయిన్‌కు వెళ్లారు. ఉక్రెయిన్ రాజధాని కీవ్‌కు చేరుకున్న ప్రధానమంత్రికి ప్రవాస భారతీయులు స్వాగతం పలికారు. నిన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఉక్రెయిన్ అధ్యక్షులు జెలెన్స్కీల మధ్య నిన్న ప్రతినిధుల స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశం గురించి విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్ జైశంకర్ వివరించారు. ఉక్రెయిన్ శాంతి నెలకొల్పేందుకు అన్ని విధాలుగా సహకరించేందుకు భారత్ సిద్ధంగా ఉందని అధ్యక్షుడు జెలెన్‌స్కీకి ప్రధానమంత్రి స్పష్టం చేశారని అన్నారు. ద్వైపాక్షిక సంబంధాలు, వాణిజ్యం, ఆర్థిక అంశాలు, రక్షణ, ఔషధాలు, వ్యవసాయం తదితర అంశాలపై చర్చలు జరిగాయని జైశంకర్ తెలిపారు.

-------------------------

గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం వానపల్లిలో నిన్న నిర్వహించిన గ్రామసభలో ముఖ్యమంత్రి పాల్గొని మాట్లాడుతూ, గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి సాధ్యమని అన్నారు. గ్రామాల అభివృద్ధి గురించి ప్రజలతో చర్చించాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 13 వేల 326 గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించామన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 4 వేల 5వందల కోట్ల రూపాయలు మంజూరు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఏడాది 9 కోట్ల పని దినాలతో 54 లక్షల కుటుంబాలకు 100 రోజుల పని కల్పిస్తామని, ఎన్నికల్లో ఇచ్చిన ఉచిత గ్యాస్ సిలెండర్ల హామీని త్వరలోనే అమలు చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో నైపుణ్య గణన సర్వే కోసం ప్రత్యేక ప్రణాళిక తయారు చేస్తున్నామని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలో నైపుణ్య గణనపై సంబంధిత అధికారులతో నిన్న మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మంగళగిరిలో పైలట్ ప్రాజెక్టుగా నైపుణ్య గణన సర్వే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సర్వేను సమర్థవంతంగా చేపట్టాలని, యువత విద్యార్హతలు, ఉపాధి, నైపుణ్యం.. వంటి అంశాలతో ప్రత్యేక విధానాన్ని సిద్ధం చేయాలని చెప్పారు. నైపుణ్య గణన ద్వారా యువతను నేరుగా సంస్థలు ఎంపిక చేసుకునే విధానం అందుబాటులోకి వస్తుందన్నారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య శిక్షణ, యువతకు ఉద్యోగాల కల్పన.. ఈ రెండు అంశాలే నైపుణ్య గణన అంతిమ లక్ష్యమని తెలిపారు.

--------------------------

వసతి గృహాలలో విద్యార్థులకు మెరుగైన విద్య, నాణ్యమైన భోజనం అందించేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డి. శ్రీబాలవీరాంజనేయ స్వామి తెలిపారు. ప్రకాశం జిల్లా కనిగిరిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ సమీకృత బాలికల వసతి గృహాన్ని, స్థానిక శాసనసభ్యులు ఉగ్ర నరసింహ రెడ్డితో కలిసి గత రాత్రి ఆయన తనిఖీ చేశారు. వసతి గృహంలో విద్యార్దులకు అందిస్తున్న వసతుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. విద్యార్థులందరికీ ఒకే రకమైన భోజనం అందించాలని అధికారులను ఆదేశించామని మంత్రి వెల్లడించారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో గ్రామపంచాయితీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. బాపట్ల జిల్లా, అద్దంకిలోని మక్కినవారి పాలెంలో నిన్న జరిగిన గ్రామ సభలో మంత్రి పాల్గొని పంచాయితీ పరిధిలోని పలు శాఖలపై ఆయా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో ప్రజలకు పని దినాలను కల్పించాలని అధికారులకు సూచించారు. గ్రామస్తుల సమస్యలను పరిష్కరించేందుకు పలు చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొంటూ

వాయిస్ ( 29 సెకన్లు)

--------------------------

తెలంగాణలో రుణమాఫీ కానీ రైతులకు నిర్ణీత తేదీని నిర్ణయించి రుణ మాఫీ చేస్తామని రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో నిన్న నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పాటైన 100 రోజుల్లోనే 5 గ్యారంటీలు అమలు చేశామని, ఇప్పటికే 22 లక్షలమంది రైతులకు 2 లక్షలలోపు రుణాలు మాఫీ చేశామని చెప్పారు. రుణమాఫీ కానీ రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఇప్పటికే రైతుల ఖాతాల్లో 18 వేల కోట్ల రూపాయలు జమచేశామని, మిగిలిన రైతుల ఖాతాల్లో మరో 12 వేల కోట్ల రూపాయలు త్వరలోనే జమ చేస్తామని మంత్రి వెల్లడించారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్ మనసులోని మాట” కార్యక్రమం 113వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. ఈ కార్యక్రమం ఆకాశవాణి, దూరదర్శన్ నెట్ వర్క్, ఏఐఆర్ న్యూస్ వెబ్ సైట్ ద్వారా న్యూస్ ఆన్ ఎయిర్ మొబైల్ యాప్‌లో ప్రసారం కానుంది. మన్ కీ బాత్ హిందీ ప్రసంగం ప్రసారమైన వెంటనే అన్ని ఆకాశవాణి కేంద్రాల్లో ప్రాంతీయ భాషల్లో దీని అనువాదం ప్రసారం అవుతుంది.

---------------------------

దేశంలో సంపూర్ణత అభియాన్ కింద గుర్తించిన ఆకాంక్షత్మక జిల్లాలు, విభాగాలలో ఆరు సూచికలలో సెప్టెంబర్‌లోగా 100 శాతం సంతృప్తత సాధించేలా చర్యలు చేపట్టాలని నీతి ఆయోగ్ ముఖ్యకార్య నిర్వహణ అధికారి బి.వి.ఆర్ సుబ్రహ్మణ్యం అధికారులను ఆదేశించారు. ఢిల్లీ నుంచి నిన్న దృశ్య మాధ్యమం ద్వారా ఆయా ఆకాంక్షాత్మక జిల్లాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా, సంపూర్ణత అభియాన్‌లో భాగంగా 2023 సంవత్సరం నుంచి 2024 ఫిబ్రవరి వరకు 6 సూచికలలో వంద శాతం సంతృప్తత సాధించిన ఆక్షాంత్మక విభాగాలకు పురస్కారాలు ప్రకటించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ఆకాంక్షాత్మక జిల్లాలు, విభాగాల నుంచి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

---------------------------

వారం వారం ప్రపంచవ్యాప్తంగా జరిగిన వార్తల విశేషాలు, వివిధ అంశాల సమాచారంతో అంతర్జాతీయ విషయాలన్నింటిని తెలుగులో అందించేందుకు ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన వసుధైక కుటుంబం ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

కేంద్ర టెలికాం శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నిన్న ఢిల్లీలో సమావేశమై టీ–ఫైబర్ ప్రాజెక్టును భారత్ నెట్ 3వ దశ పథకంలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం రేవంత్ రెడ్డి పాత్రికేయులతో మాట్లాడుతూ.. తెలంగాణలోని గ్రామాలు, మండలాలకు నెట్‌వర్క్ సదుపాయాన్ని కల్పించడమే టీ ఫైబర్ లక్ష్యమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 63 లక్షల ఇళ్లకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తామన్నారు. పట్టణ ప్రాంతాల్లో 30 లక్షల గృహాలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తామని, నెలకు 300రూపాయలకే ఇంటర్నెట్, కేబుల్ టీవీ, ఈ– విద్య సేవలు అందుబాటులోకి తీసుకొస్తామని ముఖ్యమంత్రి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని పుర, నగరపాలక సంస్థల పరిధిలో అనుమతులు లేకుండా వేసిన లేఅవుట్లపై జరిమానాలు విధిస్తామని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నగర, పురపాలక సంస్థల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఆయన నిన్న సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అక్రమ లేఅవుట్ల విషయంలో కఠినంగా వ్యవహరించాలని పుర, నగరపాలక సంస్థల కమిషనర్లను ఆదేశించారు.

======================